ప్రజాశక్తి
ఆదివారం 8 అక్టోబరు 2023

లోక్ అదాలత్‌పై అవగాహన

శ్రీకాకుళం అర్బన్ : సమస్యలను లోక్ అదాలత్ తెలియజేయడం వల్ల శాశ్వత పరిష్కారం లభిస్తుందని శాశ్వతలోక్ అదాలత్ ఛైర్మన్ జ్ఞాన సువర్ణరాజు అన్నారు. ప్రజారవాణా శాఖ జిల్లా కార్యాలయంలో రవాణా శాఖ అధికారులు సిబ్బందికి లోక్ అదాలత్‌పై శనివారం అవగాహన కల్పించారు. ఆర్‌టిసి ఉండే సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి సమస్య ఉన్నా నేరుగా సంప్రదించాలని, కోర్టుల్లో కేసు వేయడానికి ఎటువంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని అన్నారు. బాధితులకు రూ.కోటి వరకు నష్టపరిహారం పొందడంతో పాటు న్యాయం పొందడానికి వీలుందన్నారు. సమావేశంలో డిపో మేనేజర్ మాధవ్, పర్సనల్ ఆఫీసర్ కృష్ణవేణి, ఎపిఎస్ ఆర్‌టిసి ఉద్యోగులు, టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు.

భారంగా చేపల వేట

చేపల వేట ముగించుకుని ఒడ్డుకు చేరిన మత్స్యకారులు (ఫైల్)

- బోటు తిప్పేందుకు పెరిగిన ఖర్చులు
- డీజిల్ ధరలు పెరిగినా సబ్సిడీ పెంచని ప్రభుత్వం
- చేపలు దొరక్క, పెరిగిన ఖర్చుతో మత్స్యకారులు వేటకు దూరం
- ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్న పరిస్థితి

సముద్రంపై చేపల వేటనే నమ్ముకుని జీవిస్తున్న మత్స్యకారుల జీవనం క్రమేణా భారంగా మారుతోంది. చేపల ధరల తగ్గుదల, దళారుల ప్రమేయం, వేటకు అయ్యే ఖర్చులు పెరగడం వెరసి వారి జీవన విధానాన్ని దెబ్బతీస్తున్నాయి. తుపాన్లు, అల్పపీడన పరిస్థితుల్లో వేట సాగక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు చవిచూస్తున్నారు. చేపల వేటకు వెళ్తున్నా ఒక్కోసారి డీజిల్ ఖర్చులూ రావడం లేదని మత్స్యకారులు వాపోతున్నారు. పెరుగుతున్న డీజిల్ ధరలకనుగుణంగా సబ్సిడీ పెంచకపోవడంతో చేపల వేట మరింత భారంగా మారింది. ప్రభుత్వం ఇస్తున్న డీజిల్ సబ్సిడీని పెంచడంతో పాటు, రాయితీపై అందిస్తున్న డీజిల్ పరిమాణాన్ని పెంచాలని మత్స్యకారులు కోరుతున్నారు.

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి, నౌపడ

జిల్లాలో 11 తీర ప్రాంత ప్రాంత మండలాల పరిధిలో 104 గ్రామాల్లో సుమారు 3,585 రిజిస్టర్ బోట్లు ఉన్నాయి. వీటిపై సుమారు 15 వేల మంది వరకు వేట సాగిస్తున్నారు. చిన్నచిన్న పడవలపై 7 వేల మంది వరకు వేట సాగిస్తూ బతుకుతున్నారు. చేపల సంతనోత్పత్తి దృష్ట్యా ప్రతి ఏడాది ఏప్రిల్ 14 నుంచి జూన్ 15 వరకు ప్రభుత్వం చేపల వేటను నిషేధిస్తోంది. జూన్ 15 తర్వాత నిషేధం ఎత్తేసినా తుపాన్లు, వర్షాలు ఎక్కువగా సంభవించే అవకాశం ఉండటంతో ఆ కాలంలోనూ వేట తక్కువగా ఉంటుంది. అక్టోబరు నుంచి సీజన్ మొదలవుతుంది. చేపల వెళ్తున్నా గిట్టుబాటు కావడం లేదని కష్టమే మిగులుతోందని మత్స్యకారులు వాపోతున్నారు. ప్రధానంగా మెకానైజ్డ్, మోటరైజ్డ్ బోట్లకు వినియోగిస్తున్న డీజిల్ ధరలు విపరీతంగా పెరగడం ప్రధాన కారణమని తెలుస్తోంది. ప్రస్తుతం లీటర్ డీజిల్ ధర 98.97గా ఉంది. ప్రభుత్వం వీటికి లీటరుకు రూ.9 మాత్రమే ఇస్తోంది. అదీ నెలకు 300 లీటర్లను మాత్రమే ఇస్తోంది. డీజిల్ రూపంలో ఖర్చులు పెరగడంతో తమకు సగం కూడా మిగలడం లేదని మత్స్యకారులు చెప్తున్నారు. చేపల దొరక్కపోతే ఒక్కోసారి డీజిల్ ఖర్చులూ రావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

వేట సాగక వలసలు

జిల్లాలో 1,46,192 మంది జనాభా, 46,580 కుటుంబాలు ఉన్నాయి. దాదారు మూడు దశాబ్దాల కిందట వరకు ఇందులో 80 శాతం కుటుంబాలు చేపల వేటపై బతకగా మిగిలిన 20 శాతం కుటుంబాలు వ్యవసాయం, ఇతర వృత్తులు, కూలీ పనులు చేసుకునేవారు. ప్రస్తుతం మత్స్యకారుల జీవన స్థితిగతులన్నీ తారుమారయ్యాయి. ఇందులో చేపల వేటకు వెళ్తున వారి సంఖ్య సుమారు 15 వేలు మాత్రమే ఉంది. చేపల వేట సరిగా సాగక వేలాది మంది మత్స్యకారులు గుజరాత్, తమిళనాడు, మహారాష్ట్ర, గోవా, కేరళ రాష్ట్రాలకు వలస వెళ్తున్నారు. అక్కడ బోటు యజమానుల వద్ద కూలీలుగా పని చేస్తున్నారు. గుజరాత్‌లోని ఒక్క వీరావల్ ప్రాంతంలోనే జిల్లాకు చెందిన మత్స్యకారులు సుమారు 3 వేల మంది ఉన్నారు. జిల్లాలోని తీర ప్రాంతంలో చేపలు దొరక్కపోవడంతో వేలాది మంది మత్స్యకారులు ఏకంగా చేపల వేట మానుకుని ఇతర వృత్తుల్లోకి వెళ్లిపోయారు. రోడ్డు వెంబడి టోపీలు, ఊయలలు అమ్ముకుని బతుకుతున్నారు. మరికొందరు పెయింటింగ్ పనులు చేస్తున్నారు. కొంతమంది గ్రామాల్లోనే ఉంటూ ఆటోలు, ప్రయివేట్ వాహనాలకు డ్రైవర్లుగా వెళ్తున్నారు. ఇలా వేలాది మంది మత్స్యకారులు చేపల వేటకు దూరమవుతున్నారు.

డీజిల్‌పై సబ్సిడీ పెంచాలి

ప్రభుత్వం ప్రస్తుతం డీజిల్ పై లీటరుకు తొమ్మిది రూపాయలు చొప్పున సబ్సిడీ అందిస్తుంది. దాన్ని మరో రూ.5 పెంచాలి. అలాగే నెలకు 300 లీటర్లు సబ్సిడీ కింద అందజేస్తుంది. దాన్ని 500 లీటర్లకు పెంచాలి. రిజిస్టర్ అయిన బోటులకు యజమానులకు మాత్రమే సబ్సిడీ వర్తిస్తుంది. బోట్‌లో వేటకు వెళ్లే ప్రతి మత్స్యకారుడికీ సబ్సిడీ అందజేయాలి. ఒకసారి బోటుపై వేటకు వెళితే పది కిలోమీటర్ల లోపు వెళ్తే 15 నుంచి 20 లీటర్లు, అంతకుమించి వెళ్తే 50 లీటర్ల వరకు డీజిల్ ఖర్చు అవుతుంది. ఒక్కరోజు వేట సాగక కనీసం డీజిల్ ఖర్చు కూడా డబ్బులు రావడం లేదు. ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి నష్టనివారణ చర్యలు చేపట్టాలి.

- సైని గురువులు, మత్స్యకారుడు,భావనపాడు

సక్రమంగా అందడం లేదు

గత ప్రభుత్వం ఇచ్చిన సబ్సిడీ కంటే మత్స్యకారులకు మెరుగైన సబ్సిడీ ప్రస్తుత ప్రభుత్వం అందిస్తుంది. కానీ, మత్స్యకారులకు అవుతున్న ఖర్చుతో పోలిస్తే సబ్సిడీ పెద్దగా ఉపశమనం కలిగించదు. డీజిల్ ఖర్చులు పెడుతున్నందున సబ్సిడీ పెంచితే మత్స్యకారులకు కొంత ఉపయోగకరంగా ఉంటుంది. సాంకేతిక కారణాల వల్ల కొంతమందికి సబ్సిడీ కింద డీజిల్ రావడం లేదు. కొంతమంది బోట్ల యజమానులకు సబ్సిడీ కింద డీజిల్ అందడం లేదు. అధికారులు పరిశీలించి అర్హులైన ప్రతి మత్స్యకారుడికీ సబ్సిడీ కార్డులు మంజూరు చేయాలి.

- సూరాడ రాజారావు, మత్స్యకార నాయకుడు, మేఘవరం

పోరాట స్ఫూర్తి సత్యం మాస్టారు

- విశాఖలో చికిత్స పొందుతూ కన్నుమూత
- సిపిఎం జిల్లా కమిటీ సంతాపం

సత్యనారాయణ (ఫైల్)

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

కమ్యూనిస్టు పార్టీ నాయకులు కొల్లి సత్యనారాయణ (83) శనివారం కన్నుమూశారు. కొంత కాలంగా గుండె సంబంధిత వ్యాధి బాధపడుతున్న ఆయనను రెండు రోజుల క్రితం కుటుంబ సభ్యులు విశాఖ కెజిహెచ్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ కన్నుమూశారు. సత్యం మాస్టారుగా జిల్లాకు సుపరిచితులు. ఆయన భార్య సరోజని ఐదేళ్ల క్రితమే మృతి చెందారు. సహధర్మచారిణి సరోజిని ఉపాధ్యాయిని ఉంటూ యూటిఎఫ్‌లో పని చేశారు. ఉద్యోగ విరమణ తర్వాత ఐద్వా జిల్లా కార్యదర్శిగా మహిళల సమస్యలపై పోరాడారు. సత్యం మాస్టర్‌కు అజేయకుమారి, విజయకుమారి అనే ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. చిన్నమ్మాయి, అల్లుడు మరణించగా పెద్దమ్మాయి అజేయకుమారి శ్రీకాకుళంలో ఉంటున్నారు. ఆయన మృతిపై సిపిఎం జిల్లా కమిటీ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

సత్యం మాస్టర్‌గా అందరికీ పరిచయమైన కొల్లి సత్యనారయణ తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో మార్చి 20, 1940లో జన్మించారు. వ్యవసాయ ఉద్యోగి శ్రీకాకుళం జిల్లా మందస వచ్చారు. తర్వాత పలాస మండలం బొడ్డపాడు స్కూల్‌లో ఉపాధ్యాయుడిగా చేరారు. ఆ సమయంలోనే ఆయన ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న సరోజినిని 1964లో ఆదర్శ వివాహం చేసుకున్నారు. బొడ్డపాడులో పనిచేస్తున్న సమయంలో ఉద్దానం ప్రాంతంలో సాగుతున్న నక్సలైట్ ఉద్యమం వైపు వెళ్లారు. ఉద్యోగం కోల్పోవడంతో పాటు జైలు పాలయ్యారు. 1968 నుంచి 74 వరకు ఆరేళ్ల పాటు జైలు జీవితం గడిపారు. విడుదలైన తర్వాత ఎమర్జెన్సీ కాలంలో 19 నెలలు జైలులో గడిపారు. జైలు నుంచి వచ్చిన తర్వాత సిపిఎం విధానాలకు ఆకర్షితులై పార్టీలో చేరారు. సిపిఎం సీనియర్ నాయకులు చౌదరి తేజేశ్వరరావుతో కలిసి పనిచేశారు. కార్మిక సంఘాల్లో పనిచేశారు. ముఖ్యంగా మందసలో ట్రాన్స్‌ఫోర్టు వర్కర్ల హక్కుల కోసం దీర్ఘకాలం పాటు పనిచేశారు. వ్యవసాయ కార్మిక సంఘం బాధ్యతలు నిర్వహించారు. మందస ప్రాంతంలో పార్టీ, ట్రేడ్ యూనియన్ నిర్మాణానికి తన వంతు కృషి చేశారు.

నేటితరం కమ్యూనిస్టులకు ఆదర్శం

కొల్లి సత్యనారాయణ మృతి ఉద్యమాలకు తీరని లోటు అని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మృతిపై జిల్లా కమిటీ సంతాపం వ్యక్తం చేసినట్లు తెలిపారు. కమ్యూనిస్టు విలువలు, పని పద్ధతుల విషయంలో సత్యం మాస్టర్ నేటితరం కమ్యూనిస్టులకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. చివరివరకు సైద్ధాంతిక నిబద్ధతతో పార్టీ కోసం పని చేశారన్న గుర్తింపు తెచ్చుకున్నారని తెలిపారు. చివరివరకు నిరాడంబర జీవితాన్నే గడిపారని తెలిపారు.

'గడప గడప'తో సమస్యల పరిష్కారం

ఆమదాలవలస : ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. శనివారం మండలంలోని ఆర్అర్ కాలనీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ఇంతవరకు ప్రభుత్వం నుండి సంక్షేమ పథకాల లబ్ది ఎంత మేరకు అందిందో లబ్ధిదారులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృఢ సంకల్పంతో ప్రవేశపెట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రజాదరణను పొందిందన్నారు. ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు ఏ మేరకు అందుతున్నాయన్నది లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, మొండేటి కూర్మారావు, గురుగుబెల్లి చలపతిరావు, బొడపల్లి శేఖర్, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

కవిటి: ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మేనిఫెస్టోలో ప్రవేశపెట్టిన నవరత్నాలతో రాష్ట్రంలో నవశకం మొదలైందని జెడ్‌పి ఛైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, నియోజకవర్గ సమన్వయ కర్త పిరియా సాయిరాజ్ అన్నారు. మండలంలో భైరిపురంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రకాష్, దేవదాస్ రెడ్డి, ఎఎంసి ఛైర్మన్ బాబురావు పాల్గొన్నారు.

21న ప్రత్యేక లోక్ అదాలత్

జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

ప్రజాశక్తి- శ్రీకాకుళం లీగల్

ఆంధ్రప్రదేశ్ న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లాలో ఈ నెల మూడో శనివారం 21న ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అధ్యక్షులు జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. జిల్లా కోర్టులోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో హైబ్రిడ్ మోడ్‌లో హైబ్రిడ్ మోడ్లో ఇన్సూరెన్స్, ఎపిఎస్ఆర్‌టిసి, మోటార్ ప్రమాద కేసులో పిటిషనర్ అడ్వకేట్లు, ఇన్సూరెన్స్ కంపెనీల స్టాండింగ్ కౌన్సిల్ రెవెన్యూ అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. లోక్ అదాలత్‌లో కేసులు రాజి చేసుకోవడం వల్ల ఇన్సూరెన్స్ కంపెనీ, మోటారు వాహన ప్రమాదం బాధితులకు సమయం, డబ్బు ఆదా అవుతాయని అన్నారు. అందుకు ఎక్కువ కేసులు లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోవాలని ఇన్సూరెన్స్ కంపెనీ అధికారులను, స్టాండింగ్ కౌన్సిల్, పిటిషనర్ పిటిషనర్ తరపున న్యాయవాదులను కోరారు. సమావేశంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్ సన్యాసినాయుడు, జిల్లా రెవెన్యూ అధికారి గణపతి, శ్రీకాకుళం బార్ అధ్యక్షులు ఎన్ని సూర్యారావు, ఇన్సూరెన్స్ కంపెనీ స్టాండింగ్ కౌన్సిల్ మంచు జనార్ధనరావు, ఎస్.రాజేశ్వరరావు, జీవరత్నం వెంకటరావు, లక్ష్మి, ఇన్సూరెన్స్ కంపెనీ అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

స్పీకర్ సీతారాం

ప్రారంభిస్తున్న స్పీకర్ సీతారాం

పొందూరు: క్రీడలు మానసికోల్లాసానికి ఎంతగానో దోహదపడతాయని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పొందూరు పట్టణంలోని వినాయక నవరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా నెహ్రూ పార్కు ఆవరణంలో జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామీణ యువతలో నైపుణ్యాలను వెలికితీసేందుకు క్రీడలు దోహదపడతాయని పేర్కొన్నారు. అలాగే యువతలో ఐకమత్యంతో పాటు పోటీతత్వం అలవడుతుందని అన్నారు. యువత తమ ప్రతిభతో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో పేరు ప్రఖ్యాతలను పొందాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కిల్లి నాగేశ్వర రావు, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, ఎఎంసి ఛైర్మన్ బాడాన సునీల్‌కుమార్, వైస్ ఎంపిపి ప్రతినిధి వండాన వెంకటరావు, పట్టణ అధ్యక్షుడు గాడు నాగరాజు పాల్గొన్నారు.

పేదరికం తగ్గింపు ప్రణాళికపై సర్వే

మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలో గ్రామీణ పేదరిక తగ్గింపు ప్రణాళికపై పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించాలని, సుస్థిర అభివృద్ధి సూచిక మెరుగుపడేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ సూచించారు. కలెక్టరేటులో గ్రామీణ పేదరిక తగ్గింపుపై సమన్వయ కమిటీ శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదరిక నిర్మూలనకు కమ్యూనిటీ ఆధారిత సంస్థలను, వాటి నాయకత్వాన్ని బలోపేతం చేయాలన్నారు. అభివృద్ధికి సమగ్రమైన ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. విపిఆర్‌పి సర్వేలో వచ్చే అంశాలను పరిగణలోనికి తీసుకొని గ్రామ పంచాయతీలో ఆమోదం పొందాలన్నారు. సర్వే ప్రణాళికలు జీవనోపాధి, సేవలు, వనరులు, సామాజిక అభివృద్ధి ఆధారంగా జరగాలన్నారు. స్వయంశక్తి సంఘం స్థాయిలో రెండు రకాల సర్వే జరుగుందని, మిగతా రెండు రకాలూ గ్రామ సంఘం స్థాయిలో జరుగుతుందని అన్నారు. వీటిని క్రోడీకరించి ప్రాధాన్యతను బట్టి వరుస క్రమంలో గ్రామ ప్రణాళికలు తయారు చేస్తారన్నారు. కార్యక్రమంలో అధికారులు భాగస్వాములు కావాల న్నారు. ఈ సర్వే ఆధారంగా గ్రామీణ ప్రాంతాలకు అన్ని సౌకర్యాలు మెరుగు పడేందుకు వీలుంటుంద న్నారు. ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డిఆర్‌డిఎ పీడీ డి.వి.విద్యాసాగర్, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్‌రామన్, జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, ఫిషరీస్ సహాయ సంచాల కులు శ్రీనివాసరావు, డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజు, జిల్లా వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ కె.శ్రీధర్, ఐసిడిఎస్ పీడీ శాంతిశ్రీ, ఇరిగేషన్ ఇఇ పొన్నాడ సుధాకర్ పాల్గొన్నారు.

ఫిర్యాదులపై దర్యాప్తు వేగవంతం

ఎస్‌పి జి.ఆర్ రాధిక

రికార్డులను పరిశీలిస్తున్న ఎస్‌పి రాధిక

సరుబుజ్జిలి: మండలంలోని పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ సమస్యలపై వచ్చే ఫిర్యాదులపై దర్యాప్తును వేగవంతం చేసి తదుపరి చర్యలు చేపట్టాలని ఎస్‌పి జి.ఆర్.రాధిక ఎస్ఐ కూటికుప్పల కృష్ణప్రసాద్‌ను ఆదేశించారు. సరుబుజ్జిలి పోలీస్ స్టేషన్‌ను శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించి పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేసుల వేగవంతంతో పాటు రోడ్డు భద్రత, రాత్రి పూట గస్తీ, కేసుల సత్వర పరిష్కారం, నాన్ బెయిలబుల్ వారెంట్లు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

గౌరవ వేతనం అందజేత

శ్రీకాకుళం : తోటి ఉద్యోగులు ఒక్క రోజు గౌరవ వేతనంగా సమకూర్చిన నగదు చెక్కును విశ్రాంత హెంగార్డు ఐజఆదినారాయణకు ఎస్‌పి రాధిక అందజేశారు. ఆదినారాయణ శ్రీకాకుళం హోంగార్డు యూనిట్ ద్వారా సంతబొమ్మాళి పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహించారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని హోంగార్డులు స్వతహాగా విరాళంగా ఇచ్చిన ఒక రోజు వేతనం మొత్తంలో రూ.4.21 లక్షల నగదు చెక్కును అందజేశారు.

జిల్లా ఆస్పత్రి పరిశీలన

పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

డివిజన కేంద్రమైన టెక్కలి జిల్లా ఆస్పత్రిని సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఆస్పత్రిలో మందులు లేవని బాధితులు ఆరోపణలపై పరిశీలించామన్నారు. వైద్యులందరూ సమయపాలన పాటించాలని, లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. శానిటేషన్, తాగునీరు ఇబ్బందులు లేకుండా చూడాలని సూపరింటెండెంట్ బొడ్డేపల్లి సూర్యారావుకు ఆదేశించారు. ఎప్పటికప్పుడు ముందులు పరిశీలించి ఇండెంట్ పెట్టాలన్నారు. మందుల కొరత లేకుండా చూడాల్సిన బాధ్యత సూపరింటిండెంట్‌పై ఉందన్నారు.

పరీక్ష ఫీజు గడువు పెంపు

- డ్రాపౌట్ల రీఅడ్మిషన్‌కు ప్రత్యేక డ్రైవ్
- డివిఇఒ కోట ప్రకాశరావు

ప్రకాశరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఇంటర్మీడియట్ తప్పిన విద్యార్థుల కోసం పరీక్ష ఫీజు చెల్లించేందుకు గడువును పొడిగిస్తూ ఇంటర్మీడియట్ బోర్డు ఆదేశాలు జారీ చేసినట్టు డివిఇఒ కోట ప్రకాశరావు తెలిపారు. ఈమేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బోర్డు కార్యదర్శి సౌరబ్ గౌర్ ఈ వెసులుబాటు కల్పించినట్టు ఆయన వివరించారు. వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న పరీక్షలకు ఫీజు గడువును నవంబరు 30 వరకు పొడిగించారన్నారు. ఇంటర్మీడియట్ తప్పిన విద్యార్థులు, డ్రాపౌవుట్స్ జనరల్, వొకేషనల్ కోర్సుల విద్యార్థులు జ్ఞానభూమి పోర్టల్ ద్వారా ఫీజు చెల్లించాలన్నారు. నిర్ణీత ఫీజుల మొత్తాన్ని చెల్లించి పరీక్షలకు హాజరు కావాలని సూచించారు. తప్పిన విద్యార్థి అడ్మిషన్ పొంది అన్ని పరీక్షలకూ హాజరైతే ఎక్కువ మార్కులు వచ్చిన దానిని పరిగణనలోకి తీసుకుంటామన్నారు. కంపార్టుమెంటు, పరీక్ష తప్పిన వారు ఒకేసారి ఉత్తీర్ణులయితే వారికి ధ్రువీకరణ జారీ చేస్తామని పేర్కొన్నారు. తిరిగి అడ్మిషన్ పొందిన విద్యార్థులకు జగనన్న అమ్మఒడి, విద్యాకానుక, గోరుముద్ద వంటి పథకాలకు అర్హులేనని వివరించారు.

ప్రత్యేక డ్రైవ్

ఇంటర్మీడియట్ ఫెయిల్‌న విద్యార్థులు, డ్రాపౌట్స్ అయిన విద్యార్థులు రీ అడ్మిషన్ పొందేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని అన్నారు. జిల్లాలోని కళాశాల లకు వెళ్లి ఆయా ప్రిన్సిపాళ్ల సమక్షం లోనే సంబంధిత విద్యార్థులకు ఫోన్లు చేసి విద్య ఆవశ్యకతను వివరిస్తూ తిరిగి కళాశాలలో చేరేందుకు అవగాహన కల్పిస్తామన్నారు. ఇప్పటికే నరసన్నపేట, టెక్కలి, శ్రీకాకుళం కళాశాలలకు వెళ్లి అక్కడ డ్రాపౌట్స్ అయిన వారికి ఫోన్లు చేశామన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ ప్రత్యేక అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అవసరమైతే కళాశాల సిబ్బంది కూడా విద్యార్థుల ఇంటికి వెళ్లి ఇంటర్ విద్య ప్రాముఖ్యతను వివరించాలన్నారు.

డిజి లాకర్‌లో ధ్రువపత్రాలు

ఇంటర్ పాసైన విద్యార్థుల కోసం ఆన్‌లైన్‌లో ధ్రువపత్రాలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. 2014 నుంచి 2023 మధ్య చదివిన విద్యార్థులు తమ ఉత్తీర్ణత ధ్రువపత్రాలను డిజిలాకర్‌లో డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం ప్రభుత్వం కల్పించిందని తెలిపారు.

మల్లగుల్లాలు

మాజీ ముఖ్యమంత్రి, టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు వారాలు తరబడి రిమాండ్‌లో ఉండడంతో జిల్లాలో టిడిపి నిరసన కార్యక్రమాలు నిర్వహణకు మల్లగుల్లాలు పడుతుంది. అదే సమయంలో జనసేన పొత్తు ప్రకటనతో వారికి జిల్లాలో బాగా ఊరట కలిగించినట్లు తెలిసింది. మరో వైపు అధికార పక్షం వైసిపిలో శ్రీకాకుళం పార్లమెంట్ అభ్యర్థి విషయంలో మల్లగుల్లాలు పడుతున్నట్లు పరిణామాలు చెబుతున్నాయి. మారిన రాజకీయాలు మధ్య సరికొత్త సమీకరణాలు జరగాల్సిన తరుణంలో ప్రధాన పార్టీలు రెండూ మల్లగుల్లాలు పడుతుండడం విచిత్రమే కాదు. వారి ముందు అనివార్యమై కూర్చింది. వైసిపి పార్లమెంట్ అభ్యర్థి విషయంలో అధినేత దృష్టికి ధర్మాన సోదరుల వైపు మళ్లినట్లు అత్యంత విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. రాజకీయ ప్రవేశం కంటే గెలుపు గుర్రాలు లక్ష్యంగా తనయుల ఎంపిక ఉండేలా కసరత్తు మొదలైనట్లు తెలిసింది. ఇటీవల రాష్ట్రస్థాయి సమావేశం జరిగిన సమయంలో ప్రత్యేకంగా ఈ అంశంపై ఇద్దరితోనూ ప్రస్తావించినట్లు తెలిసింది. అవసరమైతే తాను ఎంపీకే వెళ్లే పరిస్థితి ఉంటుందని ఇటీవల నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ప్రకటన చేయడం చూశాం. తనయుడు శాసనసభకు పోటీ చేయడానికి ఉవ్విళ్లూరుతున్న విషయం అందరికీ తెలిసిందే. కుటుంబ సభ్యుల్లోనూ అదే అభిప్రాయం వ్యక్తమవుతున్నట్లు తెలిసింది. బరిలో నిలిస్తేనే ఆ అవకాశం లభిస్తుంది. కృష్ణదాస్‌ను అధినేత ఎంపీకి బరిలోకి దిగాలని చెబితే తన తనయుడుకు శాసనసభ టిక్కెట్ ప్రతిపాదన మరోసారి చేయనున్నట్లు తెలిసింది. గతంలో పలు సభల్లో కృష్ణదాస్ మాట్లాడుతూ ఈసారి ఎన్నికల్లో తాను పోటీ చేయనని, తన తనయుడు పోటీ చేస్తారని ప్రకటించడం చూశాం. వారసులకు టిక్కెట్లు ఇవ్వమని అధినేత చెప్పిన తరువాత ఆ మాటలన్నీ వెనక్కిపోయినట్లు తెలిసింది. మడమ తిప్పడం, మాట తప్పడం అధినేతకు అలవాటు అయ్యింది కనుక మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వారసులకు టిక్కెట్లు ఇవ్వమన్న నియమ నిబంధనలను సడలించే పరిస్థితి ఉంటుందని చెబుతున్నారు. జిల్లా అధ్యక్షులుగా ధర్మాన కృష్ణదాస్ కంటే మంత్రి ధర్మాన ప్రసాదరావు అయితే మరింత బలమైన అభ్యర్థి అవుతారన్న ప్రచారంతో పాటు అధినేత నిర్వహించిన అంతర్గత సర్వే నివేదిక చెబుతుందని తెలిసింది. ముఖ్యంగా ఇచ్ఛాపురం, టెక్కలి, పాతపట్నం, ఆమదాలవలస అసెంబ్లీ నియోజకవర్గాల్లో బలమైన గ్రూపు రాజకీయాలు పనిచేస్తున్నాయి. ఆ గ్రూపులను ఒక తాటిపై తీసుకొచ్చే సామర్థ్యం, సర్దుబాట్లు, బుజ్జగింపులు చేయడం ధర్మాన ప్రసాదరావుకు బాగా సాధ్యమవుతుందన్న ప్రచారం పార్టీలో ఉంది. అధినేత దృష్టికి కూడా ఈ విషయం వెళ్లినట్లు తెలిసింది. అందువల్ల ధర్మాన ప్రసాదరావును పార్లమెంట్ బరిలో ఉంచితే ఇటు ఎంపీ సీటుకు, అటు శాసనసభ స్థానాలకు ఫ్యాను గాలి బాగా పనిచేస్తుందన్న ప్రచారంలో పార్టీ ఉందని తెలిసింది. ఎవరిని ఎక్కడ తొక్కాలో, ఎక్కడ దించాలో, ఎక్కడ ఎత్తాలో అన్న రాజకీయ వ్యక్తం కృష్ణదాస్ కంటే ప్రసాదరావుకు బాగా అనుభవం ఉందన్నది నాయకత్వం గుర్తించినట్లు తెలిసింది. అయితే ధర్మాన ప్రసాదరావు ఒక ప్రకటన చేశారు. ఈసారి ఎన్నికల్లో తాను పోటీ చేయనని, తన తనయుడుకు టిక్కెట్ ఇవ్వాలని జగన్‌కు చెప్పినట్లు వెల్లడించిన విషయం తెలిసిందే. అయితే ఈసారీ నువ్వే పోటీ చేయాలని, తప్పదని జగన్ స్పష్టం చేసినట్లు చెప్పారు. అందువల్ల పార్లమెంట్ అభ్యర్థి ఎంపిక విషయంలో కొత్త వారికి స్థానం లభిస్తుందన్న ప్రచారాన్ని తాత్కాలికంగా తెరదించినట్లు కనిపిస్తుంది. ధర్మాన సోదరుల్లో ఎవరిలోఒకరికి కట్టబెట్టే రాజకీయ పరిణామాలు ప్రస్తుతం దోబుచులాడుతున్నాయి.

జిల్లాలో టిడిపి పరిస్థితి మరోలా ఉంది. చంద్రబాబు అరెస్టుతో నిరసనలు ఉవ్వెత్తున లేస్తాయనుకున్న టిడిపి నేతలు అంచనాలు తలకిందులయ్యాయి. కార్యకర్తలను, ముఖ్యంగా మహిళలను ముందుపెట్టి నిరసనలు చేపట్టాలని పార్టీ అధ్యక్షులు అచ్చెన్నాయుడు టెలీకాన్ఫరెన్స్‌లో నేతలకు చెప్పుకోవాల్సిన పరిస్థితి ఎదురైంది. ఆ విషయం నుంచి నేతలు తేరుకోవడానికి వారం పట్టేనట్టు కనిపించింది. ఆ తరువాత నిరసన కార్యక్రమాలకు డబ్బులు ఎవరు ఖర్చు చేస్తారన్న విషయంలో పార్టీలో కొంత చర్చ జరిగినట్లు తెలిసింది. చివరికి రాష్ట్ర పార్టీ నుంచి డబ్బులు పంపించే ఏర్పాట్లు చేసినట్లు తెలిసింది. ఎందుకంటే ధర్నా, శిబిరం ఒక రోజు నిర్వహించాలంటే కనీసం రూ.20 వేలు అవసరమవుతుందని ఆ పార్టీ నేతలే చెప్పే పరిస్థితి ఉంది. సుప్రీం కోర్టులో తన అక్రమ కేసు పూర్తిగా కొట్టివేయాలని వేసిన పిటీషన్ ఈ నెల 9న విచారణకు రానుంది. అంతవరకు నిరసనలు చేపట్టి ఆ తరువాత పరిస్థితిని బట్టి ఏం చేయాలన్న నిర్ణయం ఉంటుందని జిల్లా నేతలు చెబుతున్నారు. టిడిపితో జనసేన పొత్తు విషయంలో టిడిపిలోకంటే జనసేన అభిమానుల్లో ఎక్కువ చర్చసాగుతున్నట్లు తెలిసింది. జిల్లాలో జనసేన క్రియాశీల సభ్యులు 30 వేలు వరకు ఉందని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. నాయకులమని వారు చెప్పుకోవడం తప్ప ఆ పార్టీకి సంస్థాగత నిర్మాణం పైనుంచి కింద వరకు లేదు. జనసేన పొత్తు తరువాత రెండు పార్టీలు ఉమ్మడి కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించాయి.

అదే విషయం జిల్లాలో టిడిపి నేతలను ప్రశ్నిస్తూ... సంప్రదించడానికి ఆ పార్టీకి నాయకులనే పెట్టలేదు... మీమేమి చేస్తామని వారు ప్రశ్నిస్తున్నారు. జనసేన క్రియాశీలక కార్యకర్తలను ఈ విషయమై ప్రశ్నిస్తే... పవన్ కళ్యాణపై ఉన్న అభిమానంతో పార్టీలోకి వచ్చామని, తెలుగుదేశం పార్టీ జెండా పట్టుకుతిరగడంలో ఆలోచించాల్సిన పరిస్థితి వచ్చిందని చెబుతున్నారు. అందువల్ల రెండు పార్టీల పొత్తు ఓట్లు బదిలీ విషయంలో ఏ మేరకు ఫలితం ఉంటుందన్నది ఆచరణలో చూడాల్సి ఉంటుంది. పొత్తు అన్న తరువాత జిల్లాలో ఒక్కసీటైనా జనసేనకు కట్టబెట్టే పరిస్థితి ఉంటుందని టిడిపి నేతలు చెబుతున్నారు. పొత్తు అన్న తరువాత పలాస, పాతపట్నం, ఎచ్చెర్ల నియోజకవర్గాలపై నేతల దృష్టి మళ్లింది. ఈ మూడింటిలో ఏదో ఒక స్థానం జనసేనకు వెళ్లిపోతుందని చెబుతున్నారు. పలాసలో ఈసారి మాజీ మంత్రి గౌతు శివాజీ మళ్లీ పోటీ చేస్తారన్న చర్చ ఆ పార్టీలో ఉంది. జనసేనకు పలాసకు కేటాయించాల్సిన పరిస్థితి వస్తే... గౌతు శిరీషకు శాసనమండలికి పంపిస్తామన్న భరోసా ఇచ్చే అవకాశం ఉందని తెలిసింది.

- సత్తారు భాస్కరరావు

పరామర్శిస్తున్న కెవిపిఎస్ నాయకులు

కెవిపిఎస్ నాయకుల పరామర్శ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ముచ్చ గణేష్‌పై దాడి చేసిన కరుకోలు దేవ (దేవానంద్)పై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ యాక్టు కింద కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ఉపాధ్యక్షులు భవిరి కృష్ణమూర్తి, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) నాయకులు కాల నరసింహ, టి.రాజారావు, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గణేష్‌ను వారు శనివారం పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ నెల 5న రాత్రి తామరాపల్లి సర్పంచ్ భర్త ముచ్చ గణేష్ నరసన్నపేట వ్యక్తిగత పనిపై వెళ్లి తిరిగి వస్తుండగా, వెనుక నుంచి వచ్చిన మొగతపాడుకు చెందిన అగ్రకులానికి చెందిన కరుకోల దేవానంద్ బైక్ ఢీ కొట్టాడని అన్నారు. ఎందుకు ఢీకొట్టావని అడిగినందున బీరు బాటిల్‌తో దాడి చేశాడని అన్నారు. అక్కడే ఉన్న వ్యక్తి గణేష్ సర్పంచ్ భర్త అని చెప్పినా వినకుండా కులం పేరుతో బూతులు తిడుతూ ఆయనను అవమానపరిచి కొట్టాడని అన్నారు. కులం పేరు పెట్టి దూషించి చేసిన దేవపై పోలీసులు ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసును నమోదు చేసి అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు. పరామర్శించిన వారిలో కె.సవరయ్య, వై.చలపతిరావు, తలసముద్రం మోహనరావు ఉన్నారు.

జ్యోతిప్రజ్వలన చేస్తున్న డాక్టర్ భాస్కర్

ముగిసిన ఆంధ్రా మెడికల్ ఎడ్యుకేటర్స్ సమావేశాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎపి మెడికన్ 2023 పేరిట ఆంధ్రా మెడికల్ ఎడ్యుకేటర్స్ అసోసియేషన్ 13వ వార్షిక సమావేశాలు జిల్లాలోని రాగోలులో ఉన్న గ్రేట్ ఈస్టర్న్ మెడికల్ స్కూల్ ఆస్పత్రిలో గురువారం నుంచి మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశాలను కిమ్స్ గ్రూప్ చైర్మన్ డాక్టర్ బొల్లినేని భాస్కర్ ప్రారంభించారు. దేశవ్యాప్తంగా వివిధ కళాశాలలు, ఆస్పత్రిలో సేవలందిస్తున్న వైద్య నిపుణులు హాజరై పలు అంశాలపై తమ ప్రసంగాలను అందించారు. కార్యనిర్వాహక కమిటీ చైర్మన్ డాక్టర్ డి.లక్ష్మి, కో-చైర్మన్ డాక్టర్ హవీలా పర్యవేక్షణలో ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ ఆఫ్ మెడికల్ ప్రొఫెషన్‌పై మాట్లాడారు. మెడికల్ సూపరెండెంటెండ్ డాక్టర్ అశోక్‌రెడ్డి, డాక్టర్లు సుధీర్, అంబేద్కర్, రామారావు, రామ్మోహనరావు, పి.వి.చలం, చేతన దేశాయ్, గీతాంజలి, నిక్సెట్, అనిభిషెంట్, జయప్రకాష్ ప్రెజెంటేషన్ ఇచ్చారు.

వెలుగు సిబ్బందికి శిక్షణ

కొత్తూరు: స్థానిక వెలుగు అసోసియేషన్ కార్యాలయంలో వెలుగు కార్యదర్శి బి.సంజీవరావు అధ్యక్షతన రెండు రోజులు పాటు కొత్తూరు, భామిని, సీతంపేట, హిరమండలం, ఎల్ఎన్. పేట, మెళియాపుట్టి, పాతపట్నం మండలాలకు చెందిన వార్డు మెంబర్లు మేట్స్, విఒఎ అధ్యక్షులకు రెండు రోజులు పాటు 2023, 2024 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వ జిఒ ప్రకారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. వేతనదారుల హక్కులు, ఉపాధిహామీ పథకం చట్టంలోమార్పులు, రోజుకు రూ.272 వేతనం రావాలంటే ఎంత పని చేయాలి, ఎన్ని గంటలు పని చేయాలనే దానిపై గ్రామాల్లో ఎదుర్కొటున్న సమస్యలుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ ఎస్.తేజ, రిసోర్స్‌పర్సన్ కె.దాస్ నాయుడు, చిరంజీవరావు పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష'తో ఇంటింటికీ వైద్యం

ప్రజాశక్తి- రణస్థలం

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ పిలుపు నిచ్చారు. మండలంలోని యఱ్ఱవరం గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్, స్పాట్ రిజిస్ట్రేషన్, కేస్ షీట్ కౌంటర్, ల్యాబ్ టెస్టింగ్ కౌంటర్, మందుల పంపిణీ కౌంటర్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి, రణస్థలం మండలం ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, జడ్‌పిటిసి టొంపల సీతారాం, ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రతినిధి లంకలపల్లి ప్రసాద్, ఎంపిడిఒ రమణమూర్తి, ఎఒ ధనుంజయరావు, పంచాయతీ అధికారి ప్రభాకరరావు, వైద్యులు గిరిబాబు, రజిని, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

కవిటి: కవిటి మండలం కొజ్జిరియా గ్రామంలో శనివారం జరిగిన ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీడాప్ చైర్మన్ శ్యామ్ ప్రసాద్‌రెడ్డి, ఇచ్ఛాపురం పిఎసిఎస్ చైర్మన్ ఎన్. నరేంద్ర, మున్సిపల్ చైర్ పర్సన్ పి. రాజ్యలక్ష్మి, ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్, సర్పంచ్ ఉప్పాడ నీల తదితరులు పాల్గొన్నారు.

పోలాకి: మండలం డోల సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సంతలక్ష్మీపురం సర్పంచ్ ప్రతినిధి యారబాటి వెంకట రమణ, జెసిఎస్ మండల కన్వీనర్ కణితి సత్తిబాబు, స్థానిక సర్పంచ్ ప్రతినిధి డోల ఉధయ భాస్కరరావు, చింతాడ ఉమా, డిటి పి.శ్రీనివాసరావు, ఎంపిడిఒ ఉషశ్రీ, వైద్యులు శ్రీనాథ్, రత్నం రాజు, చందనం, రవికుమార్ పాల్గొన్నారు.

నందిగాం: మండలం సైలాడ గ్రామంలో సర్పంచ్ ప్రతినిధి శంబాన దానయ్య, ఎంపిటిసి సభ్యులు పిన్నింటి జయరాం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, ఎంపిపి శ్రీరామమూర్తితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో పిఏసిఎస్ అధ్యక్షులు కురమాన బాలకృష్ణారావు, ఎంపిడిఒ శివప్రసాద్, డిటి ధనలక్ష్మి, వైద్యాధికారులు అంజలి, అనితకుమారి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్, సర్పంచ్‌లు మడపాల సంజీవరావు, బోరుభద్ర సోమేశ్వరరావు సైలాడ పంచాయతీలోని వైసిపి నాయకులు, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, పంచాయతీ సెక్రెటరీ, వలంటీర్లు పాల్గొన్నారు.

లావేరు: ప్రజారోగ్యం కోసం ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని జగనన్న సురక్ష కార్యక్రమన్నీ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు

మండలంలోని బెజ్జిపురంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ పరిశీలించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు, మాజీ ఎంపిపి రాజినాయుడు, జెసిఎస్ ఇన్‌ఛార్జి మీసాల శ్రీనివాసరావు, ఎంపిడిఒ కుప్పిలి సురేష్ కుమార్, వైద్యులు జగదీష్ కుమార్, మణిభూషణ్ పాల్గొన్నారు.

మెళియాపుట్టి: మండలంలోని ఇలైపురం, నేలబొంతు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే రెడ్డి శాంతి పాల్గొన్నారు. కార్యక్రమంలో తహసిల్దార్ పి.సరోజినీ ఎంపిడిఒ పి.చంద్రకుమారి, ఎంఇఒ ఎం.పద్మనాభం, ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ్ కుమార్, జెడ్‌పిటిసి ఎండయ్య, పిఏసిఎస్ అధ్యక్షులు ఉర్లన బాలరాజు, వైసిపి కన్వీనర్ యోగి, వైద్యాధికారులు గ్రీష్మ, అలేఖ్య, సర్పంచ్‌లు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : టెక్కలి సచివాలయం-1 ఎన్టీఆర్ కాలనీలో సర్పంచ్ సుజాత అధ్వర్యంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి రాఘవరావు, పిఏసిఎస్ అధ్యక్షులు సత్తారు సత్యం, టెక్కలి ఎంపిపి అట్లా సరోజనమ్మ, ఎంపిటిసి శ్రీధర్ రెడ్డి, పీత హేమలత, అనంతయ్య, ప్రజా ప్రతినిధులు, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: దేవునల్తాడలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రతినిధి పాలిన శ్రీనివాసరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వరదరాజు, ఎంపిటిసి వెంకన్న, వైద్యాధికారులు సుధీర్, ప్రత్యూష, రిమ్స్ వైద్యులు లాస్య, తహశీల్దార్ బి.అప్పలస్వామి, ఇఒపిఆర్‌డి తిరుమలరావు, పంచాయతీ కార్యదర్శి కామరాజు, విఆర్ఒ షణ్ముఖరావు, వైద్య సిబ్బంది, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ఎఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

జి.సిగడాం: పేదలకు ఆరోగ్య భరోసా కల్పించి సంపూర్ణ ఆరోగ్యాలతో తీర్చిదిద్దడమే ఆరోగ్య సురక్ష ప్రధాన లక్ష్యమని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ పేర్కొన్నారు. నడిమివలస సచివాలయం పరిధి ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపిపి మీసాల సత్యవతి, మండల పరిషత్ ప్రత్యేక అహ్వానితుడు మీసాల వెంకటరమణ, స్థానిక సర్పంచ్ బాలి సావిత్రి, సర్పంచ్ ప్రతినిధి బాలి రమేష్, వైద్యులు ప్రతిష్ఠ శర్మ, అనూష, హరిత శ్రీ, జెడ్‌పిటిసి కాయల రమణ, పప్పల వేణుగోపాలరావు, సురేష్, పి.భవ్య, జెసిఎస్ కన్వినర్ డోల వెంకట రమణ, బాలి అప్పలసూరి, మీసాల దానకర్ణ, ఆబోతుల జగన్నాధం, పంచాయితీ కార్యదర్శి కూనిబిల్లి కోటేశ్వరావు, హరిబాబు, ఎస్.అనుషా, ఎంఎల్ఒ గౌరీ శంకర్ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలో తులసిపేట ప్రభుత్వ పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష మెగా వైద్య శిభిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, పేడాడ వెంకటరావు, ఎంపిడిఒ ఫణీంద్రకుమార్, డిటి ఆర్.మధు, సర్పంచ్ సంపతిరావు వెంకటరమణ, వైద్యులు, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బూర్జ: మండలములో ఓవిపేట గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో జడ్పిటిసి రామారావు పాల్గొన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అమ్మాజమ్మ, వైస్ ఎంపిపిలు బి .సూర్యరావు, రాష్ట్ర టిట్కో డైరెక్టర్ గోవిందరావు, ఎంపిపి ప్రతినిధి నాగేశ్వరరావు, ఎంపిడిఒ రవీంద్రబాబు, తహశీల్దార్ రమణారావు, వైద్యులు రోజా, వాణిశ్రీ, కిమ్స్, రిమ్స్ వైద్య అధికారులు పాల్గొన్నారు

పలాస: పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి డెంకివీధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, వైస్ చైర్మన్ మీసాల సురేష్ బాబు, విప్ దుర్గాశంకర్ పండా, డబ్బీరు భవానీ శంకర్, కౌన్సిలర్ శార్వాణి గీత, సనపల సింహాచలం, ఉమా కుమారి, మున్సిపల్ కమిషనర్ టి. నాగేంద్ర కుమార్ పాల్గొన్నారు. లొత్తూరులో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపిడిఒ ఎన్.రమేష్ నాయుడు, రెంటి కోట ప్రాథమిక

కవిటి : వైద్య శిబిరాన్ని పారంభిస్తున్న రామారావు

టెక్కలి రూరల్ : స్టాల్స్‌ను పరిశీలిస్తున్న కృపారాణి, వాణి

లావేరు: అంగన్వాడీ స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కిరణ్ కుమార్

అర్హులందరికీ 'ఉపాధి' పనులు

డ్వామా పీడీ చిట్టిరాజు

గ్రామసభలో మాట్లాడుతున్న పీడీ చిట్టిరాజు

ప్రజాశక్తి- జలుమూరు

2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రణాళిక ప్రక్రియను సిబ్బంది బాధ్యతగా చేపట్టాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు జి.వి.చిట్టిరాజు అన్నారు. శనివారం మండలంలోని కొమనాపల్లి గ్రామంలో ప్రణాళిక ప్రక్రియపై నిర్వహించిన గ్రామ సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని అన్ని వర్గాల వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని పనులను గుర్తించాలన్నారు. గ్రామ సభ నిర్వహించే సమయంలో ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు, రైతులను భాగస్వామ్యం చేయాలని, కనీసం 100 మంది రైతులు గ్రామసభకు హాజరు కావాలన్నారు. ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా వ్యక్తిగత పండ్ల తోటల పెంపకం మరియు ప్రభుత్వ స్థలాల్లో మొక్కల పెంపకం పనులకు ప్రాధాన్యతను ఇవ్వాలని కోరారు. ఆయా గ్రామాల పరిధిలోని పంట కాలువల పనులను శతశాతం చేపట్టే విధంగా ప్రణాళికలు రూపొందించాలన్నారు. హౌసింగ్ 90 రోజుల పనిదినాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని, పని కోరిన వారందరికీ ఉపాధి చూపించే విధంగా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, అందుకు అవసరమైన అంచనాలను రూపొందించి అనుమతులు తీసుకోవాలన్నారు. ప్రతి మండలంలోను 15వేలు తక్కువ కాకుండా వేతనదారులు పనులకు వచ్చే విధంగా సిబ్బంది క్షేత్రస్థాయిలో పనులను చేపట్టాలని ఆదేశించారు. అనంతరం శ్రీముఖలింగం గ్రామంలోని పులిబంద, నేరేడుబంద చెరువులను పరిశీలించారు. ఈయన వెంట మండల ఉపాధి హామీ పథకం ఇన్‌ఛార్జి ఎపిఒ పి. సోమేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.

కృపమ్మ కుటుంబాన్ని ఆదుకోవాలి

శ్రీకాకుళం అర్బన్ : గుంటూరు జిల్లా తాడేపల్లిలో జగన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో మృతి చెందిన ఆశా కార్యకర్త రేపూడి కృపమ్మ కుటుంబానికి ప్రభుత్వం రూ.50 లక్షలు ఎక్స్ గ్రేషియా చెల్లించాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమన్నాయుడు, పి.తేజేశ్వరరావు, ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె.నాగమణి ప్రభుత్వానినికి వేరొక ప్రకటనలో డిమాండ్ చేశారు. కృపమ్మ ఆరోగ్య సురక్ష క్యాంపులో విధులు నిర్వహిస్తూ ఒత్తిడికి గురై అపస్మారకస్థితిలోకి వెళ్లడంతో విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారని అన్నారు. సకాలంలో వైద్యం అందించని కారణంగా దారిలోనే ఆమె మృతి చెందినట్లు అక్కడి వైద్యులు గుర్తుంచారని అన్నారు. అంత్యక్రియలు నిర్వహించడానికి ఆమె భౌతికకాయాన్ని కుటుంబ సభ్యులకు ఇంతవరకు అప్పగించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె కుటుంబానికి న్యాయం చేయమని ఆందోళనలు చేస్తున్న ఆశా కార్యకర్తలను, ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి, గుంటూరు జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ, ఆశా నాయకులు లక్ష్మిలను అక్రమంగా అరెస్టులు చేసి తాడేపల్లి పోలీసు స్టేషన్‌లో నిర్బంధించడం సరికాదన్నారు.

గాలి జనార్ధన్‌రెడ్డిని కలిసిన వసంతరెడ్డి

ప్రజాశక్తి- నౌపడ

సత్కరిస్తున్న వసంత రెడ్డి

స్థానిక జెడ్‌పిటిసి పాలవసంతరెడ్డి కళ్యాణరాజ్య ప్రగతిపక్ష పార్టీ అధ్యక్షులు గాలి జనార్ధన్ రెడ్డిని బెంగళూరులోని ఆయన నివాసంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను దుస్సావతో సత్కరించారు. ఈ సందర్భంగా వసంతరెడ్డి మాట్లాడుతూ రాజకీయాలకు రాకముందు నుంచే ఆయనతో మంచి సంబంధాలున్నాయని తెలిపారు. ఆయన స్థాపించిన పార్టీ ద్వారా ప్రజలకు మరింత సేవ చేయాలని వసంతరెడ్డి ఆకాంక్షించారు.

ధ్రువపత్రాలను అందిస్తున్న కరస్పాండెంట్ కృష్ణమూర్తి

ఉత్తమ విద్యార్థులకు పురస్కారాలు

ఇచ్ఛాపురం: స్థానిక సత్యసాయి పాఠశాలలో 9,10వ తరగతి విద్యార్థులు నిర్వహించిన ఆన్లైన్ పరీక్షపై చర్చ కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ చూపించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సంతకంతో పాటు విద్యార్థులనుద్దేశించి ప్రతిజ్ఞ, సర్టిఫికెట్ అందించారు.. ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండెంట్ ఎస్.కృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యార్థులందరూ తమ ప్రతిభను చూపాలన్నారు. పాఠశాల అన్ని రంగాల్లో కూడా రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాత్రికేయుడు చక్రధర్ మృతి


చక్రధర్ (ఫైల్)

ఆమదాలవలస : పాత్రికేయుడు సనపల చక్రధర్ (37) శుక్రవారం రాత్రి మరణించారు. ఇటీవల కొద్ది రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన శుక్రవారం రాత్రి ఓ ప్రైవేటు ఆస్పత్రిలో తుది శ్వాస విడిచారు. ఈయనకు భార్య అనూష, కుమార్తె ప్రేరణ ఉన్నారు. ఈయన గతంలో ప్రైమ్ నైన్ ఎలక్ట్రానిక్ ఛానల్‌లో పనిచేశారు. ప్రస్తుతం ఢిల్లీ క్రైమ్ రిపోర్టర్ గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈయన అన్నయ్య సనపల కిరణ్ కుమార్ రణస్థలం తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తహశీల్దార్ తమ్ముడు మరణవార్త తెలుసుకున్న ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ శనివారం సాయంత్రం మృతుని స్వగృహానికి చేరుకొని తహశీల్దార్ కిరణ్ కుమార్‌ను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈయన వెంట రణస్థలం జెడ్‌పిటిసి టొంపల సీతారాం, మండల పార్టీ అధ్యక్షులు మహంతి పెద్దరామునాయుడు తదితరులున్నారు.

రంగస్థల కళాకారుడు మృతి

కృష్ణమూర్తి (ఫైల్)

పొందూరు: మండలం లోలుగుకు చెందిన రంగస్థల కళాకారుడు పిసిని కృష్ణమూర్తి(62) శనివారం గుండె పోటుతో మృతి చెందారు. ఈయన ప్రస్తుతం విజయనగరంలో స్థిర నివాసం కాగా, స్వగ్రామం లోలుగులో అంత్యక్రియలు నిర్వహించారు. ఈయన భూమిబాగోతం, బుర్రకథలో హాస్యనటుడుగా గుర్తింపు పొందారు. అంతేకాకుండా ఎంతోమంది కళాకారులను తీర్చిదిద్దారు. ఈయనకు భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈయన మృతికి జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, సర్పంచ్ లోలుగు ధనలక్ష్మి, ఎంపిటిసి లక్ష్మునాయుడు, వైస్ సర్పంచ్ చంద్రరావు, కుమ్మరి శాలివాహన సంఘం డైరెక్టర్ వీరాస్వామి తమ సంతాపాన్ని తెలిపారు.

అలరించిన నృత్యరూపకం

శ్రీకాకుళం అర్బన్ : అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ధర్మ ప్రచార వారోత్సవాల్లో భాగంగా మహిళల నృత్య రూపకం ఆకట్టుకుంది. అభినయ నృత్య కళా నికేతన్ అధ్యక్షులు డాక్టర్ నీరజ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యన బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఆలయ ప్రాంగణంలోని అనివేటి మండపంలో నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆలయ ఇఒ వి.హరి సూర్యప్రకాష్, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

చట్టం ముందు అందరూ సమానమే

రెవెన్యూ మంత్రి ధర్మాన

శ్రీకాకుళం అర్బన్ : స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల ఏర్పాటులో సీమెన్స్ సంస్థ తమ ప్రమేయం లేదని చెప్పిందని, కేవలం చంద్రబాబు కొన్ని షెల్ కంపెనీలతో దోచుకున్నారని మంత్రి ధర్మాన ప్రసాదరావు విమర్శించారు. నగరంలోని డిసిసిబి కాలనీలో రూ.1.8 కోట్ల వ్యయంతో నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్‌ను శనివారం ప్రారంభించారు. అలాగే కాలనీలో రూ.22 లక్షల వ్యయంతో పార్కు నిర్మాణం, రూ.20 లక్షలతో చిల్డ్రన్ పార్కు, రోడ్ల నిర్మాణానికి రూ.77 లక్షలు ఖర్చు చేస్తున్నట్టు తెలిపారు. ప్రజలకు ప్రభుత్వం వైద్యం అందించడానికి పెద్దఎత్తున నిధులు ఖర్చు చేస్తున్నట్టు చెప్పారు. అనంతరం చంద్రబాబు అరెస్టుపై మాట్లాడుతూ దోచుకున్న వారిలో కొందరు పరారీలో ఉన్నారని, ఇద్దరు అమెరికాకు పారిపోయారని, కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీలు సైతం ఈ వ్యవహారంలో కేసులు నమోదు చేశాయని అన్నారు. చట్టం ముందు అందరూ సమానమేనని, దేశంలో ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడైన పి.వి.నరసింహారావు, జయలలిత, లాలూప్రసాద్ యాదవ్ వంటి వారూ న్యాయస్థానాల్లో దోషులుగా నిలబడ్డవారేననని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజల జీవన ప్రమాణాలు వైసిపి పాలనలో పెరిగాయని, ఆ దిశగా ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ఆలోచనలు సాకారమవుతున్నాయని అన్నారు.

సహకార సంఘాలను నిర్వీర్యం చేసిందే చంద్రబాబు

మాట్లాడుతున్న చింతాడ రవికుమార్

ఆమదాలవలస : సహకార సంఘాలను నిర్వీర్యం చేసిన ఘనత చంద్రబాబు నాయుడుదేనని వైసిపి ప్రచార విభాగం జోనల్ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని బొడ్డేపల్లిపేటలో ప్రజాసేవ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చక్కెర కర్మాగారం, కో-ఆపరేటివ్ సొసైటీల కోసం టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ నోటికి వచ్చినట్లు పచ్చి అబద్దాలను మాట్లాడుతున్నారని, ముందు చరిత్రను తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు. గ్రామీణ ప్రాంత రైతాంగానికి ఉపాధి కల్పించి, చదువుకున్న స్థానిక యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న ఉద్దేశంతో ఏర్పాటైనవి సహకార సంఘాలన్నారు. సహకార సంఘాలను నిర్వీర్యం చేయాలన్న ఉద్దేశంతో 1995-2004 సంవత్సరాల మధ్య చంద్రబాబు ప్రభుత్వం కో-ఆపరేటివ్ సొసైటీస్ యాక్ట్ -1964 ను సవరించి మరీ సొసైటీలను అమ్మకాలు చేపట్టారని అన్నారు. కోర్టు తీర్పుకు వ్యతిరేకంగా కూన రవికుమార్ మేనమామ తమ్మినేని శ్యామలరావు చక్కెర కర్మాగారం చైర్మెన్‌గా ఉండి వాళ్ల సొంత లాభాల కోసం ఆమదాలవలస సుగర్ ఫ్యాక్టరీని బలవంతంగా అమ్మకం జరిపారని తెలిపారు. 2014లో చంద్రబాబు, కూన రవికుమార్ చక్కెర కర్మాగారం తెరిపిస్తామని హామీ ఇచ్చి తీరా అధికారంలోకి వచ్చాక కర్మాగారం ఆస్తులను 2016లో ఎపిఐఐసి ద్వారా కాజేయాలని చూసిన పచ్చి మోసగాళ్ళని దుయ్యబట్టారు. 2016లో కోర్టు తీర్పు రైతులకు అనుకూలంగా వచ్చినప్పటి నుంచినిస్వార్థంగా ప్రజల మధ్య, కోర్టుల ద్వారా పోరాడుతున్నది తామేనని జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చారన్నారు. ఈయనతో పాటు వైసిపి నాయకులు ముద్దాడ ఈశ్వరరావు, సువ్వారి మనోహర్, చింతాడ రాఘవేంద్ర రాజశేఖర్, సంతోష్ తదితరులున్నారు.

ఉద్దానంలో జీడి బోర్డు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- పలాస

ఉద్దానం ప్రాంతంలో ప్రాంతీయ జీడి బోర్డును ఏర్పాటు చేయాలని జనసేన నియోజకవర్గం నాయకులు డాక్టర్ వి.దుర్గారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని ఉద్దాన ప్రాంతంలోని మాకన్నపల్లి, గురుదాసుపురం, అమలపాడు తదితర ప్రాంతాల్లో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిత్లీ తుఫాను సంభవించినప్పటినుంచి ఉద్దానం ప్రాంతంలో జీడీ, కొబ్బరి బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాలకు డిమాండ్ చేస్తున్నప్పటికీ స్పందించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి ప్రాంతీయ జీడి పరిశోధన కేంద్రాన్ని బాపట్ల నుండి పలాసకి తరలించమని కోరడం జరిగిందని, ఆయన సుముకత వ్యక్తం చేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో సమస్య పరిష్కారం కాలేదన్నారు. జీడి బోర్డు, జీడి పరిశోధన కేంద్రాలు వస్తే ఈ ప్రాంత ప్రజనీకానికి స్థానికంగా ఉపాధి లభిస్తుందన్నారు. వ్యవసాయ ఆధారిత ఉత్పత్తులను చిన్న చిన్న పరిశ్రమలు స్థాపించి ఈ ప్రాంత యువతకు ఉపాధి కల్పించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో దున్న భక్తుడు, మదనాల వెంకటరమణ, ఢిల్లీరావు, దున్న అనిల్, ఎలమంచి జగదీష్, ఢిల్లేశ్వరరావు పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న దుర్గారావు

రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపిక

ప్రజాశక్తి- పోలాకి

ఎపి మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజ్ విద్యార్థులు శనివారం టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆవరణంలో నిర్వహించిన జిల్లాస్థాయి ఆటల పోటీల్లో అండర్-19 విభాగంలో కబాడీ, ఖోఖో, నెట్ బాల్ ఆటల్లో విజయం సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు పాఠశాలలో అభినందనలు తెలిపారు. అలాగే రాష్ట్ర స్థాయిలో కూడా మంచి ఫలితాలు సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బి. శ్రీరామమూర్తి, ఫిజికల్ డైరెక్టర్ ఎం.నీలం పాల్గొన్నారు.

అభినందనలు తెలుపుతున్న ప్రిన్సిపల్ ప్రవీణ

నవ్యది హత్య కేసుగా నమోదు చేయాలి

నరసన్నపేట : నరసన్నపేట పట్టణంలో సంచలనాత్మకంగా మారిన తండ్రి, కూతుర్ల మరణాలపై కళింగ కోమటి నాయకులు కదంతొక్కారు. వివాహిత నవ్యను చిత్రహింసలకు గురిచేసి చంపి బాత్రూంలో కాల్చేసిన ఉదంతం చూసి మానసిక వేదనతో నవ్య తండ్రి శనివారం ఉదయం చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడడంపై స్పందించారు. నరసన్నపేట పట్టణం కళింగ కోమటి నాయకులు అందరూ సమిష్టిగా శనివారం సంఘీభావం ప్రకటిస్తూ దుకాణాలు మూసివేశారు. అలాగే పట్టణ వీధుల్లో మహిళలు, యువకులు అందరూ కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. నవ్యను చంపిన వారిని కఠిన శిక్షలు వేయాలని, నవ్య కేసును హత్య కేసుగా నమోదు చేయాలని వీరు డిమాండ్ చేశారు. జిల్లా పార్టీ అధ్యక్షులు, నరసన్నపేట సీనియర్ శాసనసభ్యులు ధర్మాన కష్ణదాస్ జిల్లా ఎస్పీతో మాట్లాడారు. ప్రశాంత వాతావరణానికి నిలయమైన నరసన్నపేట పట్టణంలో ఇటువంటి సంఘటన జరగడం చాలా బాధాకరమని, తండ్రి, కూతుర్ల మరణానికి కారణమైన వారిపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు. అనంతరం డిఎస్‌పిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. కార్యర్యరకమంలో కళింగ కోమటి నాయకులు, సుడా చైర్మన్ కోరాడ చంద్రభూషణ గుప్త, నరసన్నపేట వైసిపి పట్టణ అధ్యక్షులు పొట్నూరు సాయిప్రసాద్, మండల విప్, ఎంపిటిసి వైశ్యరాజు కేశవరాజు, బోయిన బాలకష్ణ, ఎంపిపి అరంగి మురళీధర్, తొందర కూరాకుల చైర్మన్ రాజాపు అప్పన్న, సర్పంచ్ బురెల్ల శంకర్, దేవిడ్‌లి తదితరులు ఉన్నారు.

వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఇష్టంతో చదివితే విజయం మీదే

మాట్లాడుతున్న మురళీకృష్ణ

టెక్కలి రూరల్: ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు కష్టంతో కాక ఇష్టంతో చదవాలని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు, రచయిత డాక్టర్ కెవిజిబి మురళీకృష్ణ హితవు పలికారు. ఈ విద్యాసంవత్సరంలో మొదటి ఏడాది పలు ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశించిన విద్యార్థులకు ఇంజినీరింగ్ కోర్సుపై అవగాహన పెంచేందుకు శనివారం ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన ప్రసంగించారు. పలు రంగాల్లో ఇంజినీరింగ్ బ్యాక్ గ్రౌండ్ ఉన్న విద్యార్థులు రాణించడానికి, చాలా మంది జీవితంలో వైఫల్యం చెందుటకు కారణాలను ఉదాహరణలతో వివరించారు. ప్రధానంగా భాషా నైపుణ్యాలు, వృత్తి నౌపుణ్యాలను ప్రతిఒక్కరూ వృద్ధి చేసుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించిన అన్ని అనుమతులతో పాటు ఉత్తమ ర్యాంకింగ్ ఇంజినీరింగ్ కళాశాలను గుర్తించుటకు ఏర్పడే అన్ని ఏజెన్సీలు ఐతమ్‌ను అత్యుత్తమ కళాశాలల్లో ఒకటిగా గుర్తించాయన్నారు. కళాశాల కార్యదర్శి ఎల్ఎల్.నాయుడు, డైరెక్టర్ ప్రొఫెసర్ వివి. నాగేశ్వరరావు, ప్రొఫెసర్ మురళీకృష్ణను అభినందించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎఎస్.శ్రీనివాస రావు, డీన్ డాక్టర్ డి.విష్ణుమూర్తి, పలువురు డీన్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధే లక్ష్యం

ప్రజాశక్తి- కవిటి

పంచాయతీ అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు మేజర్ పంచాయతీ కవిటి సర్పంచ్ పూడి లక్ష్మణరావు తెలిపారు. శనివారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇప్పటి వరకూ పంచాయతీలో జరిగిన అభివృద్ధి, సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపిటిసి పూడి నీలాచలం, కో-ఆప్షన్ మెంబర్ పాండవ శేఖర్, రెడ్డిక జెఎసి కార్యదర్శి బర్ల నాగభూషణం, నాయకులు డి. ధర్మారావు, డి. దుర్యోధన, ఇఒపిఆర్‌డి శివాజీ, పాణీగ్రాహి, ఇఒ జి.వీరభద్రస్వామి, విఆర్ఒలు ఎస్.నారాయణ, పి. ప్రశాంతి, వార్డు సభ్యులు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : మండలంలోని నగరంపల్లి పంచాయతీలో రూ.3.40 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని సర్పంచ్ ప్రతినిధి, వజ్రపుకొత్తూరు పిఏసిఎస్ అధ్యక్షుడు దువ్వాడ మధుకేశ్వరరావు అన్నారు. శనివారం సచివాలయంలో కార్యదర్శి రోణంకి మధు ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. సచివాలయం శాశ్వత భవనం రూ.25 లక్షల నిధులతో రైతు భరోసా కేంద్రం శాశ్వత భవనం నిర్మించామని, ప్రభుత్వ బడులను నాడు-నేడు ద్వారా అభివృద్ధి, రూ.15 లక్షలతో విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం, రూ. 80 లక్షలతో పాఠశాల్లో 8 గదులు నిర్మింంచామని అన్నారు. జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం అధికారి పేడాడ ఆనందరావు మాట్లాడుతూ తడి చెత్త, పొడి చెత్త ద్వారా సేకరించిన సేంద్రియ ఎరువులు వ్యవసాయానికి ఉపయోగించడం వల్ల రైతులకు మంచి లాభసాటి అవుతుందన్నారు. కార్యక్రమంలో ఇసి హరినాథ్, టిఎ వామాక్షి, జయరాం, ఫీల్డ్ అసిస్టెంట్ ఎస్.రామకృష్ణ, ఎంపిటిసి ప్రతినిధి బమ్మిడి మోహనరావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: మండలంలో బాలకృష్ణాపురంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ. కోటి 40 లక్షలు నిధులు మంజూరైందని సర్పంచి ప్రతినిధి బొరుభద్ర లొహిదాసు తెలిపారు. చెరువులు, మట్టి రోడ్లు, డ్రెయినేజీలు, సిసి రోడ్లు, చెరువుగట్టు వాల్స్, రోడ్డు ఇరువైపుల చెట్లు గుర్తించామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బదకల మోహన్ దాస్, సెక్రటరీ ఊర్మిళ, పితాంబరు, ఇసి సురేష్, వాలంటీర్లు, ఉపాధి కూలీ పాల్గొన్నారు.

కవిటి : మాట్లాడుతున్న సర్పంచ్ లక్ష్మణరావు

ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న చిన్నంనాయుడు

కిరణ్‌కు అభినందనలు

ప్రజాశక్తి- పలాస

జిల్లాకి చెందిన బాల, బాలికలు ఇటీవల కర్నూల్ జిల్లా మహానందిలో జరిగిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విషయం తెలిసిందే. గోల్డ్ మెడల్ సాధించిన బాలుర జట్టుకు కాశీబుగ్గ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న జి. చాయకిరణ్ ప్రాతినిధ్యం వహించాడు. దీంతో చాయాకిరణ్‌కు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వై.చిన్నంనాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పీడీలు కుసుమ, హరినాథ్, గణేష్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జగదీశ్వరరావు

ఘనంగా ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎచ్చెర్ల రాజీవ్ గాంధీ యూనివర్సిటీలో శనివారం ఘనంగా ఫ్రెష ర్స్ డే వేడుకలు నిర్వహించారు. ముందుగా డైరెక్టర్ జగదీశ్వరరావు ప్రారంభించారు. ఇందులో భాగంగా ఇంజినీరింగ్ విద్యార్థులు పియుసి విద్యార్థులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఎచ్చెర్లలో ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుందని, విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహియించాలని అన్నారు. ఇంజినీరింగ్ విద్యా పూర్తి చేసి బయటకి వచ్చేసరికి మంచి ఇంజినీరింగ్ విద్యార్థులుగా ఉన్నతమైనా ఉద్యోగాలు పొందాలని చెప్పారు. అందరూ గ్రామీణ విద్యార్థులని, విద్యలో స్పోర్ట్, యోగా, అన్నింట్లో ముందుండాలని అన్నారు. కార్యక్రమంలో ఒఎస్‌డి సుధాకర్‌బాబు, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, డీన్ మోహన్ కృష్ణ చౌదరి, ఫైనాన్స్ ఆఫీసర్ అసిరినాయుడు, వెల్ఫేర్ డీన్ గేదెల రవి, డిప్యూటీ ఎఒ రఘుపతిరావు, డాక్టర్లు శ్రీధర్, ఈశ్వరరావు, ధనం జయరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాలల హక్కులను పరిరక్షించాలి

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

బాలల హక్కులను పరిరక్షించడం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మణి అన్నారు. శనివారం మండలంలోని షలంత్రి జిల్లా పరిషత్ హైస్కూల్ లో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కణితి విజయలక్ష్మిబాయి ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. విద్యార్థిని, విద్యార్థులకు బాలల హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల వలన జరిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం పాఠశాల విద్య, బాలల చట్టాలు, బాల కార్మికులు, విద్యాహక్కు, దిశ వంటి చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు సిపాన గోవిందరావు, తమ్మినేని అన్నంనాయుడు, సనపల ప్రసాద్, హనుమంతు అచ్చన్నాయుడు, పైడి వరాహ నరసింహం, కింతలి త్రినాథరావు పాల్గొన్నారు.

ప్రశంసాపత్రాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

విద్యార్థులకు ప్రశంసలు

ప్రజాశక్తి- నందిగాం

మండలం లలితాసపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు పరీక్షాపే చర్చ కార్యక్రమంలో వర్చువల్ విధానం ద్వారా కార్యక్రమంలో కాలిన మమత, బుడ్డ ఊర్మిళ, వంకల శృతిలు పాల్గొనిలో పాల్గొని ప్రధానమంత్రి సంతకంతో కూడిన ప్రశంసా పత్రాలను పొందినట్లు ప్రధాన ఉపాధ్యాయులు చిలుకు కృష్ణారావు శనివారం ప్రకటనలో తెలిపారు

భువనేశ్వరిని కలిసిన టిడిపి నాయకులు

భువనేశ్వరిని కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి- పొందూరు

రాజమహేంద్రవరంలో టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరిని శనివారం పొందూరు టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహనరావు ఆధ్వర్యంలో మండల నాయకులు మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ తామంతా పార్టీకి అండగా నిలచి పోరాటం చేస్తామని తెలిపారు. రానున్న ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేసి పార్టీని అధికారంలోకి తీసుకురావాలని ఆమె వారికి సూచించారు. ఆమెను కలిసిన వారిలో తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి బలగ శంకర భాస్కరరావు, పట్టణ అధ్యక్షుడు శ్రీరంగ, దుప్పల గణపతి, సనపల రామకృష ఉన్నారు.

మాట్లాడుతున్న సివిల్ జడ్జి జ్యోత్స్న

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి- పొందూరు

సీనియర్ సిటిజన్స్ తమకు ర్యాజ్యాంగం కల్పిస్తున్న చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి బి.జ్యోత్స్న పేర్కొన్నారు. మండలం గోరింట గ్రామంలో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్స్‌కు గల హక్కులను, చట్టాలను వివరించారు. అలాగే వృద్ధాప్యంలో తల్లిదండ్రులకు కుటుంబ సభ్యులు అండగా నిలవాలని తెలిపారు. వరల్డ్ మెంటల్ హెల్త్ డే సందర్భంగా పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చింతాడ శ్రీలక్ష్మి, న్యాయవాదులు బ్రహ్మాజీ, అశోక్, రంగారావు పాల్గొన్నారు.

చెరశాలతో టిడిపి నిరసన

పలాస : చెరశాలలో రిలే నిరాహార దీక్షలు చేస్తున్న శిరీష

ప్రజాశక్తి- ఆమదాలవలస

సైకో ముఖ్యమంత్రి జగన్ రెడ్డిని ఇంటికి పంపించాల్సిందేనని టిడిపి జిల్లా అధ్యక్షుడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి కూన రవికుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని టిడిపి కార్యాలయం వద్ద నేను సైతం రిలే నిరాహార దీక్షలో బూర్జ మండలానికి చెందిన టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. దీక్షా శిబిరాన్ని రవికుమార్ సందర్శించి పీరుకట్ల ప్రభాకర్, ఆనెపు రామకృష్ణలకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింప చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు చేసిన అభివృద్ధిని గుర్తుంచుకొని ఐటీ ఉద్యోగులు ఎల్లలు దాటి నేడు ఆయనకు మద్దతు తెలుపుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ డెవలప్మెంట్ కేసులో రూ.372 కోట్లు అవినీతి జరిగిందని చెప్పి తరువాత 272 కోట్లకు వచ్చి నేడు రూ.27 కోట్ల అవినీతి జరిగిందని, అది కూడా టిడిపికి విరాళాల రూపంలో చేరిందని చెప్పడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. చంద్రబాబుకు వస్తున్న ప్రజాదారణను తట్టుకోలేక అవినీతే లేని కేసులో అక్రమ అరెస్టు చేశారని మండిపడ్డారు. అనంతరం తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పిలుపుమేరకు విద్యుత్ దీపాలను ఆర్పి వేసి కొవ్వొత్తులు, సెల్‌లైట్లు, టార్చ్‌లైట్లను వెలిగించి రవికుమార్ ఆధ్వర్యంలో దీక్షా శిబిరం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు లంక జగన్నాథం నాయుడు, వావిలపల్లి రాంజీ, మజ్జి శ్రీరాములు నాయుడు,కడగల కృష్ణ, హనుమంతు గోవిందరావు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డులలో అలాగే మండలంలోని పలు గ్రామాలలో తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు శ్రేణులు తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పిలుపు మేరకు ఉత్సాహంగా క్రాంతితో కాంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో మాజీ మున్సిపల్ చైర్మన్ తమ్మినేని గీత ఆధ్వర్యంలో మహిళలు విద్యుత్ దీపాలను ఆర్పి వేసి కొవ్వొత్తులతో తమ నిరసనను తెలియజేశారు. అలాగే మండలంలోని శ్రీనివాసచార్యుల పేట సర్పంచ్ బొడ్డేపల్లి గౌరీపతిరావు ఆధ్వర్యంలో తెదేపా శ్రేణులు విద్యుత్ దీపాలను ఆర్పి వేసి కొవ్వొత్తులు, సెల్ ఫోన్ లైట్లు, టార్చ్ లైట్లను వెలిగించి నిరసన తెలియజేశారు. సైకో పోవాలని సైకిల్ పాలన రావాలని ఆధ్వర్యంలో కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

పలాస : కాశీబుగ్గలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష ఆధ్వర్యంలో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా చేపట్టిన రిలే నిరాహారదీక్షలు శనివారంతో 25 రోజుకు చేరుకుంది. ఇనప చెరసాల ఏర్పాటు చేసి వినూత్నంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా శిరీష మాట్లాడుతూ న్యాయానికి సంకెళ్ళు, ప్రజా నాయకుడికి చెరసాల అనే కార్యక్రమంతో ప్రజల ముందుకు వచ్చామన్నారు. నియంతృత్వ ప్రభుత్వం కళ్లు తెరిచే వరకు న్యాయ పోరాటం కొనసాగుతుందని చంద్రబాబు కడిగిన ముచ్చంలో అక్రమ కేసు నుండి బయటపడతారని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబురావు, రాష్ట్ర బిసిసెల్ ప్రధాన కార్యదర్శి కామేష్, పార్లమెంటు ప్రధాన కార్యదర్శి విఠల్, గాలి కృష్ణ, గురుటి సూర్యనారాయణ, బడ్డ నాగరాజు, భావన దుర్యోధన, లబ్బ రుద్రయ్య, శశిభూషన్, యవ్వారి మోహనరావు, అంబటి రామకృష్ణ, జాన అప్పారావు, దడియాల నరసింహులు, సూరడ మోహనరావు, అరసవల్లి ఉమా మహేశ్వరరావు పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టులను ఖండిస్తూ టిడిపి నాయుకుల ఆధ్వర్యంలో కాంతిలో క్రాంతి కార్యక్రమం నిర్వహించారు. గౌతు శిరీష ఆధ్వర్యంలో టిడిపి కార్యాలయంలో నిర్వహించారు. విద్యుత్ దీపాలు ఆపి చరవాణి ఫ్లాష్ లైట్ వేసి నిరసన తెలియజేసారు. ఈ సందర్భంగా చంద్రబాబుకు అనుకూలంగా నినాదాలు చేసారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బాబురావు, పార్లమెంటు ప్రధాన కార్యదర్శి విఠల్, గాలి కష్ణ, పట్టణ అధ్యక్షుడు నాగరాజు, లొడగల కామేశ్వరరావు, సప్ప నవీన్, చిలకమ్మ, శంకర్, నరసింహులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్రాహ్మణతర్లలో...

టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును ఖండిస్తూ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ పిలుపుమేరకు పలాస నియోజవర్గ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు బ్రాహ్మణతర్ల గ్రామంలో తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ సభ్యులందరూ సెల్ఫోన్ ద్వారా లైట్లు, బైక్ లైట్లు వేసి నిరసన కార్యక్రమం తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి ఆళ్ళ.వెంకటరావు, సల్ల విశ్వనాథం, ఎర్ర సిమ్మన్న, కొవ్వూరు ధర్మారావు, బత్తల సూర్యం, గరికి కృష్ణారావు, ఆళ్ళ సోమేష్, వడ్డి ఢిల్లీ తదితరులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి : వైసిపి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు, అక్రమాల గురించి చంద్రబాబునాయుడు ప్రజల్లోకి తీసుకువెళ్ళి వినిపించి, వారిని చైతన్య పరుస్తుండడం వల్లే చంద్రబాబుపై జగన్ అక్రమమ కేసులు బనాయించి జైలుకు పంపారని టెక్కలి నియోజకవర్గ అగ్నికుల క్షత్రీయ (పల్లి సామాజిక వర్గ) సంఘంనేత, తర్లిపేట సర్పంచ్ వాడరేవు శ్రీనివాసరావు అన్నారు. జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆ పార్టీ మండల అధ్యక్షుడు బోయిన రమేష్ ఆధ్వర్యంలో టిడిపి కార్యాలయం వద్ద శనివారం టెక్కలి నియోజకవర్గ పల్లికుల నాయకులు, మహిళలు చేపట్టిన సామూహిక నిరాహార దీక్షలో ఆయన పాల్గొని సంఘీభావం తెలిపారు. చంద్రబాబునాయుడుకు 45 సంవత్సరాలు రాజకీయ చరిత్ర కలిగి, 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తికి అక్రమంగా అడ్డగోలుగా కేసులు పెట్టి, జైలుకు పంపారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు, మాజీ ఎంపిపిలు వెలమల విజయలక్ష్మి, కామేశ్వరరావు, తర్ర రామక్రిష్ణ, మట్ట సుందరమ్మ, టెక్కలి మండల పార్టీ అధ్యక్షుడు బగాది శేషు, సంతబొమ్మాళి మండల పార్టీ అధ్యక్షుడు జీరు భీమారావు, టెక్కలి మండల మహిళ అధ్యక్షులు మెండ దమయంతి, టిడిపి నాయకులు నంబాళ్ళ శ్రీనివాస్, గొండు లక్ష్మణరావు పాల్గొన్నారు.

టెక్కలి: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ బాబుతో నేను కార్యక్రమాన్ని ఇంటింటా ప్రచారం చేయనున్నామని టెక్కలి మండల టిడిపి అధ్యక్షులు బగాది శేషగిరి అన్నారు. బాబుతో నేను కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక ఇందిరాగాంధీ జంక్షన్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కార్యకర్తలతో మాట్లాడుతూ బాబుతో నేను కార్యక్రమాన్ని విస్తృత పర్చనున్నామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు హనుమంతు రామకృష్ణ, చాపర గణపతి, కోళ్ల లవకుమార్, మట్ట పురుషోత్తం, దమయంతి, ప్రీతిష్చంద్, మామిడి రాము, కోల్ల కామేష్, బెహరా కాళీ, సుందరమ్మ పాల్గొన్నారు.

మోకాళ్లపై కూర్చోని నిరసన చేపడుతున్న నాయకులు

శ్రీకాకుళం అర్బన్ : చంద్రబాబును అరెస్టు చేసి జైలుకు పంపడంలో జగన్ రాజకీయ కక్షసాధింపు దోరణి ఉందని, ఆయన కుట్ర పూరిత చర్యలను ప్రజలు ఖండించాలని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి అన్నారు. నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో టిడిపి నగర కమిటీ ఆద్వర్యాన రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కవ్వాడి సుశీల, సీపాన రమ, పిఎంజె బాబు, మాదారపు వెంకటేష్, సురకాశి వెంకటరావు, ముద్దాడ కృష్ణమూర్తి నాయుడు, జల్లు రాజీవ్ పాల్గొన్నారు.

మెళియాపుట్టి: మండలంలో పలు గ్రామాల్లో కాంతితో క్రాంతి కార్యక్రమం శనివారం రాత్రి టిడిపి నాయకులు నిర్వహించారు. చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు భాస్కర్ గౌడ్, జిల్లా టిడిపి మహిళా ఉపాధ్యక్షురాలు బూర్ల లలిత కుమారి, మండల తెలుగు యువత అధ్యక్షులు బసవ పరమేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

లావేరు : ఈ రాక్షస ప్రభుత్వానికి ప్రమాద గంటికలు త్వరలోనే మోగనున్నయని చంద్రబాబు పాలనకోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని మాజీమంత్రి టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు కిమిడి కళావెంకటరావు అన్నారు. శనివారం రాత్రి మండలంలోని బెజ్జిపురం గ్రామంలో ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద కాంతితో క్రాంతి కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు, ప్రజలు కొవ్వుత్తులు, టార్చిలైట్లు తో నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడుపై అక్రమం గా కేసులు వేసి అన్యాయంగా జైలులో పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని త్వరలోనే ఇంటికి పంపేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిడి మండల అధ్యక్షుడు ముప్పడి సురేష్, ఎచ్చెర్ల మాజీ ఎఎంసి చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, మాజీ జడ్‌పిటిసి వి. మధుబాబు, ఆర్ ప్రకాశరావు, గంట్యాడ అప్పలనాయుడు పాల్గొన్నారు.

కవిటి : దొంగ కేసులు నుంచి కడిగిన ముత్యంలా చంద్రబాబు నాయుడు బయటకు వస్తారని కవిటి మండలం టిడిపి నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. టిడిపి అధిష్టానం పిలుపు మేరకు శనివారం రాత్రి కవిటి మండలం టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు లైట్లు ఆర్పి కొవ్వొత్తులతో తమ నిరసన తెలిపారు. మనిచంద్రా ప్రకాష్, బెందాలం రమేష్, సంతోష్ పట్నాయక్, బాసుదేవ్ రౌలో, పుల్లట సంతోష్, పుల్లట రాజు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సకాలంలో జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయుల పెన్షన్, జీతాలను సకాలంలో చెల్లించాలని ఎపిటిఎఫ్ సీనియర్ నాయకులు హెచ్‌వి సత్యనారాయణ అన్నారు. శనివారం ఎపిటిఎఫ్ జోనల్ స్థాయి సమావేశాన్ని పట్టణంలోని పూజారిపేట కార్యాలయంలో నిర్వహించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగున్నర ఏళ్లు కావస్తున్నప్పటికీ ఉద్యోగ, ఉపాధ్యాయుల డిఎ, పిఆర్‌సి బకాయిలను చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో ఆమదాలవలస, సరుబుజ్జిలి, బూర్జ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు పి.అప్పలనాయుడు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బి.చంద్రశేఖర్, బివిఎస్ఎన్. మూర్తి, బి.మహేష్, కె.రాజేష్, డి.అనిల్ కుమార్, ఎస్.రామన్న, టి.సూర్యనారాయణ, బివిఎస్ నాయుడు, బి. ముకుందరావు, బి.సుందరరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎపిటిఎఫ్ నాయకులు సత్యనారాయణ

సైబర్ నేరాలపై అప్రమత్తం

ప్రజాశక్తి- ఆమదాలవలస

సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆర్థిక అక్షరాస్యత కో-ఆర్డినేటర్ చిగురుపల్లి వెంకటేష్ అన్నారు. మంగళవారం మండలంలోని చిట్టీవలస గ్రామంలో ఆర్‌బిఐ పథకంలో భాగంగా యూనియన్ బ్యాంకు సౌజన్యంతో ఎస్‌ఎస్‌టి స్వచ్ఛంద సంస్థ నిర్వహణలో ఆర్థిక అక్షరాస్యతపై స్వయం సహాయక సంఘాల సభ్యులకు కళాజాత బృందసభ్యుల ద్వారా అవగాహన కల్పించారు. బ్యాంకు నుండి మాట్లాడుతున్నామని ఎవరైనా ఫోన్ చేసి అకౌంట్ వివరాలను అడిగితే అటువంటి వారికి సమాచారం ఇవ్వొద్దని సూచించారు. బ్యాంకులు ఎప్పుడు ఖాతాదారులకు ఫోన్ చేసి వివరాలు అడగవన్నారు. ఏటిఎంల్లో అపరిచితులకు కార్డును ఇచ్చి డబ్బులు విత్ డ్రా చేయించరాదని, బ్యాంకుల ద్వారా అమలవుతున్న ఇన్సూరెన్స్ పథకాలపై వివరించారు. సైబర్ మోసాలకు గురైతే 1930, ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్ మెన్ 14448 టోల్ ఫ్రీ నెంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాజాత బృందం సభ్యులు శంకరరావు, సత్యన్నారాయణ, ఎం. లక్ష్మి, సిసి గురుమూర్తి, సచివాలయ కన్వీనర్ అచ్యుతరావు, ఆర్థిక అక్షరాస్యత సిఎఫ్ఎల్ కో-ఆర్డినేటర్లు హరనాథ్, రామారావు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న సిఎఫ్‌ఎల్ కో-ఆర్డినేటర్ హరనాథ్

నిందితులను కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

కంద్రవీధికి చెందిన నాగుల ధర్మారావును హత్య చేసిన వారిని శిక్షించాలని మృతుని బంధువులు శనివారం అంబేద్కర్ జంక్షన్‌లో శిబిరం ఏర్పాటు చేసి న్యాయం కావాలని నినాదాలు చేశారు. వివరాల్లోకి వెళ్తే టెక్కలి మండలం నర్సింగపల్లి పంచాయతీ, కొల్లివలస గ్రామ ప్రాంతంలో జూలై 7న నాగుల ధర్మారావు మరో ఇద్దరు చేపల వేటకు వెళ్ళి, ఇద్దరు వ్యక్తులు తిరిగి ఇంటికి చేరుకోవడం, నాగుల ధర్మారావు తిరిగి రాకపోవడంతో మృతిని బంధువులు వెతకడం ప్రారంభించారు. నరసింగపల్లి పంచాయతీ కొల్లివలస గ్రామ ప్రాంతంలో నాగుల ధర్మారావు మృతి చెందినట్లు గుర్తించి టెక్కలి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో, పోలీసులు మృతదేహన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం చేయించారు. అనంతరం మృతుని బంధువులు ధర్మారావుతో కలిసి వెళ్లిన ఇద్దరిలో ఒకరు ధర్మారావుని హత్య చేసినట్లు పలుమార్లు పోలీస్ అధికారులకు తెలియజేసినట్లు బంధువులు ఆరోపించారు. పోస్టుమార్టం నివేదికలో మృతుడు అధికంగా ఆల్కహాల్ సేవించడం వలన మృతి చెందినట్లు ఉందని ఎస్ఐ ఎల్ .రామకష్ణ మృతుని బంధువులకు తెలిపినా వారు అర్థం చేసుకోలేక పోతున్నారని ఎస్ఐ ఎల్.రామకృష్ణ తెలిపారు. శిబిరం సందర్శించిన డిఎస్‌పి బాలచంద్రారెడ్డి మృతుని బంధువులతో మాట్లాడి విషయాన్ని తెలుసుకున్నారు. ధర్మారావు మృతి వివరాలు సిఐ సూర్య చంద్రమౌళి డిఎస్‌పికి వివరించడతో వెంటనే శిబిరం తొలగించాలని డిఎస్‌పి ఆదేశించారు. సిఐ చంద్రమౌళి మృతుని బంధువులతో మాట్లాడుతూ ఏమైనా అనుమానాలుంటే కోర్టులో ప్రైయివేటు కేసు వేసుకోవాలని సూచించి శిబిరాన్ని తొలగించారు. అయితే బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం మరింత ఉధృతం చేస్తామని తెలిపారు.

ఒత్తిడిని జయించాలి

ప్రజాశక్తి- కవిటి

విద్యార్థి జీవితంలో ఒత్తిడిని జయిస్తే విజయం వరిస్తుందని ఆంగ్ల ఉపాధ్యాయుడు మొర్రి గోపి అన్నారు. స్థానిక ఎస్‌విజె విద్యా సంస్థల్లో ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం అనే అంశంపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో ఎల్‌కెజి నుంచి పిజి వరకు విద్యార్థులు ఒత్తిడికి గురవుతున్నారని, దానిని గమనించి పిల్లలకి మానసిక ధైర్యం కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తీసుకోవాలని సూచించారు. అదే విధంగా విద్యార్థులు కూడా చెడు వ్యసనాలకు బానిస కాకుండా విలువైన సమయాన్ని ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ బెందాలం కింగ్, ప్రిన్సిపల్ ఎం.భాస్కరరావు, ఎఒ సిహెచ్ జోష్, జె. భీమరావు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

ఔషధ మొక్కల పంపిణీ

ప్రజాశక్తి- బూర్జ

మండల కేంద్రమైన బూర్జలో బయో డైవర్స్ టై ఆధ్వర్యంలో సమకూర్చిన ఔషధ మొక్కలను ఎంపిపి కర్నేన దీప, జెడ్‌పిటిసి బెజ్జిపురపు రామారావు చేతుల మీదుగా శనివారం పంపిణీ చేశారు. గిరిజనుల నివాసం ఉన్న ఎపిపేట, పెద్దపేట, డొంకలపర్త, పాలవలస, అన్నంపేట, జంగాలపాడు, తోటవాడ, వైకుంటపురం, లక్కుపురం, పంచాయతీల కార్యదర్శులకు మొక్కలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఔషధ మొక్కల ద్వారా భవిష్యత్తులో మంచి ఉపయోగాలు, లాభాలు ఉంటాయన్నారు. ఈ మొక్కలు నాటడమే కాకుండా రక్షణ కల్పించి ప్రతినిత్యం నీరుపోసి పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రవీంద్రబాబు, డిసిఎంఎస్ డైరెక్టర్ జల్లు బలరాంనాయుడు, పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు కళ్లద్దాల పంపిణీ

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులో సాయికాలనీ స్కూల్‌లో కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్, మెడికల్ సిబ్బంది అధ్వర్యంలో విద్యార్థులకు కళ్ళద్దాలు పంపిణీ చేశారు. టిటి ఇంజక్షన్లు వేయడంతో పాటు విద్యార్థులు అవసరం మేరకు వారి కళ్ళ పరిస్థితి ప్రకారం రీడింగ్ గ్లాసెస్, ప్రిస్కిప్షన్ గ్లాసెస్ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ప్రేమ్ చంద్, ఉపాధ్యాయ సిబ్బందితో పాటు మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కిరణ్‌కి సన్మానం

ప్రజాశక్తి- రణస్థలం

ఆంధ్రప్రదేశ్ ఎస్టిమేట్స్ కమిటీ సభ్యులుగా రెండవ సారి ఎన్నికైన ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్‌కి శనివారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో శాలువతో సన్మానించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో వైసిపి నాయకులు పచ్చిగుళ్ల సాయిరాం, నేతింటి నీలమప్పడు, దన్నాన సీతారాం, పిన్నింటి సత్యంనాయుడు, టేకి బ్రహ్మాజీ, మింద్రాన రామారావు, బాలరాజు, కునుకు కన్నప్పడు, రాజాపంతుల సాయి, తదితరులున్నారు.

స్కూల్ గేమ్స్ ఎంపికలు

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో శనివారం అండర్-19 స్కూల్ గేమ్స్ ఎంపికలు జరిగాయి. జిల్లా నలుమూలల నుండి వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు ఎంపికలకు హాజరయ్యారు. కబాడీ, ఖోఖో, నెట్ బాల్, రగ్బీ, రూప్ స్కిప్పింగ్ వంటి క్రీడలకు ఎంపికలు నిర్వహించారు. ఎంపికల్లో శ్రీకాకుళం స్కూల్‌గేమ్స్ సెక్రటరీ ఎన్. రమణ, మీట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బాడాన నారాయణరావు, ఎస్. శ్రీనివాసరావు, పిడిలు చరణ్, రమేష్, రామిరెడ్డి, కె. ప్రకాష్, లక్ష్మణ రాజా, వైవి వెంకటరమణ, ఆదిశేషు, కాపల రఘు ఉన్నారు.

వైసిపితోనే గ్రామాల అభివృద్ధి

ప్రజాశక్తి- పలాస

వైసిపితోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని అల్లుకోల సర్పంచ్ దువ్వాడ వామాక్షి అన్నారు. మండలంలో అల్లుకోల గ్రామంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.80 లక్షల వ్యయంతో సచివాలయం, హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రం నిర్మాణం చేపట్టి ప్రారంభించడం జరిగిందన్నారు. గ్రామంలో సమస్యలు ఉంటే ప్రతిపాదనలు పెట్టి పనులు చేపడతామన్నారు. రీ సర్వే ద్వారా భూములు సర్వే చేయడం జరిగిందన్నారు. అనంతరం రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల సచివాలయ కన్వీనర్ దువ్వాడ రవికుమార్, పంచాయితీ కార్యదర్శి సద్గుణబాబు, శ్రీనివాసరావు, షణ్ముఖరావు పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న కళావెంకటరావు

మాజీ మంత్రి కళా పరామర్శ

ప్రజాశక్తి- లావేరు

మాజీమంత్రి టిడిపి పోలిట్ బ్యూరో సభ్యుడు ఎచ్చెర్ల టిడిపి ఇన్‌ఛార్జి కిమిడి కళావెంకటరావు శనివారం పెద్దలింగలవలస గ్రామానికి చెందిన పిఎసిఎస్ మాజీ అధ్యక్షుడు మీసాల అప్పారావును పరామర్శించారు ఇటీవల అప్పారావు తల్లీ నారాయణమ్మ మృతి చెందిన విషయం తెలుసుకొని పరామర్శించారు. అలాగే బొంతుపేట గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త కిల్లారి అప్పలనాయుడు పెళ్ళి అయిన యాడాదిన్నరకి ఇటీవల రోడ్డు ప్రమాదంకి గుర్తై మృతి చెందడంతో అప్పలనాయుడు కుటుంబ సభ్యులును పరామర్శించారు.ఈయన వెంట టిడిపి మండల అధ్యక్షుడు ముప్పడి సురేష్, ఎచ్చెర్ల మాజీ ఎఎంసి చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర ,మాజీ జెడ్‌పిటిసి పి. మధుబాబు, ఉన్నారు.

మృతుల కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న రవికుమార్

రవికుమార్ పరామర్శ

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన టిడిపి సానుభూతుపరుల కుటుంబాలను శనివారం టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ పరామర్శించారు. మండలంలోని పొందూరు, బాణాం, లక్ష్మీపేట, జి.సిగడాం మండలంలోని దవళపేట గ్రామాలలో మృతి చెందిన టిడిపి సానుభూతుపరుల కుటుంబ సభ్యులను ఆయన ఓదార్చారు. ఈయనతో పాటు మండల టిడిపి ఉపాధ్యక్షుడు బాడాన శేషగిరినాయుడు, కార్యకర్తలు భవానీ, రవి, శివ ఉన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

దిబ్బవానిపేట గ్రామానికి చెందిన పుక్కళ్ల శివాజీ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నారు. నిరుపేద కుటుంబం కావడంతో వైద్య ఖర్చులకు ఇబ్బంది పడుతుండడంతో విషయం తెలుసుకున్న యువతరం సేవా సమితి సభ్యులు రూ.15వేలు బాధిత కుటుంబానికి శనివారం అందించారు. కార్యక్రమంలో యువతరం సేవా సమితి అధ్యక్షుడు చింత మురళి, గున్న వెంకటరమణ, కోనేటి దుర్గారావు, గొరకల అశోక్, బత్తిన లక్ష్మణరావు, అంగ అశోక్, గొరకల సునీల్ పాల్గొన్నారు.

స్పీకర్‌ను కలిసిన విక్రాంత్

ఆమదాలవలస : ఇటీవల శాసనమండలి విప్‌గా నియమితులైన ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ స్పీకర్ తమ్మినేని సీతారాంను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. శనివారం పట్టణంలోని స్పీకర్ క్యాంప్ కార్యాలయానికి వచ్చి తమ్మినేని సీతారాంను శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగిన పాలవలస కుటుంబానికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మంచి గుర్తింపు ఇచ్చారన్నారు. శాసనమండలిలో ప్రభుత్వం తరపున విప్‌గా క్రియాశీలకంగా పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు

స్పీకర్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్